జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి


బొబ్బిలి: ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: సీఎం జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. స్థానిక పట్టణ పరిధిలోని 15వ వార్డులో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యేకు ఆ వార్డు ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్నిప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందేలా నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ప్రతీ వర్గంలోని వారికి లబ్ధి జరిగేలా సంక్షేమ పథకాలు రూపొందించి, అమలుచేశారన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. మరోవైపు ప్రతీ సచివాలయం పరిధిలో ప్రజల మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తూ అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. సచివాలయాల ద్వారా ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే లంచాలకు తావులేకుండా పథకాలు చేరుస్తున్నారన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పే టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. కోవిడ్ విపత్తు సమయంలోనూ ఎవరూ ఏ రకమైన ఇబ్బందులు పడకుండా అందరూ మెచ్చుకునేలా సీఎం జగన్ పాలన కొనసాగించారన్నారు. అటువంటి ముఖ్యమంత్రికి మనమంతా అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే ఓటు, ఎంపీ ఓటు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, జగనన్నకు కానుకగా ఇవ్వాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గొలగాన రమాదేవి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు తూముల రామసుధీర్, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జ్ రేజేటి ఈశ్వరరావు(విసు), తదితరులు పాల్గొన్నారు.


తెర్లాం: చీకటిపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: మండలంలోని చీకటిపేట, అరసబలగ, పూనువలస పంచాయతీల్లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం


సంతకవిటి: బలరాంపేటలో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని కోరుతున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

- ఎన్నికల ప్రచారంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

సంతకవిటి: వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని, రానున్న ఎన్నికల్లోనూ జగనన్న ప్రభుత్వాన్నే మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని సిరిపురం, చిన్నసిరిపురం, యాగాటిపేట, జగన్నాథపేట, బలరాంపేట గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆయా నేతలకు గ్రామస్తులు సాదరస్వాగతం పలికారు. జై జగన్.. జై వైఎస్సార్ సీపీ.. నినాదాలు చేస్తూ వారిలో ఉత్సాహం నింపారు. అనంతరం వారు ఇంటింటికీ వెళ్లి, ఈ ఐదేళ్లలో జగనన్న సర్కారు చేసిన అభివృద్ధి, సంక్షేమం వివరించారు. రాష్ట్రం, రాష్ట్రంలోని ప్రజలు మరింత బాగుండాలంటే వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. పేదల బతుకులు బాగుచేస్తున్న సీఎం జగన్‌కు మనమంతా అండగా నిలవాలన్నారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ వైఎస్సార్ సీపీకే వేసి, తమను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే తలే బద్రయ్య, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, సర్పంచ్ దోల తిరుపతి, ఎంపీటీసీలు కర్రి కామేశ్వరరావు, పాండ్రంకి కృష్ణ, కర్రి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి విశేష ఆదరణ

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: ప్రజాక్షేత్రంలో వైఎస్సార్ సీపీకి, ప్రభుత్వానికి విశేష ఆదరణ ఉందని, ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాసేపు మాట్లాడారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎంతోమంది జీవితాల్లో సంతోషం నింపాయన్నారు. అన్నివర్గాలకు మేలు జరిగేలా పథకాలు అమలు చేసిన తీరు, అన్నిప్రాంతాలు బాగుండేలా చేపట్టిన అభివృద్ధి పనులే ఆయన సుపరిపాలనకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ ఎన్నికల్లో డబ్బులున్న వారికే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు టికెట్లు ఇచ్చారని, జగనన్న మాత్రం టికెట్ల పంపిణీలో కూడా సామాజిక న్యాయం పాటించారన్నారు. చాలామంది పేదలకే టికెట్లు కేటాయిస్తూ ఆదర్శంగా నిలిచారన్నారు. రాష్ట్రం మరింత బాగుండాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీనే అధికారంలోకి రావాలన్నారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి నేతలు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. ప్రతిఒక్కరూ మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఓటు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి


రామభద్రపురం: పాతరేగలో వైఎస్సార్ సీపీ నేతల ఎన్నికల ప్రచారం


రామభద్రపురం: జన్నివలసలో వైఎస్సార్ సీపీని గెలిపించాలని ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సరస్వతి, తదితరులు


వంగర: అరసాడలో ఇంటింటికీ వెళ్లి, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరుతున్న పార్టీ మండల కన్వీనర్ సుదర్శనరావు

ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నేతలు ప్రచారంలో జోరు పెంచారు. శనివారం జరిగిన ప్రచారంలో ఇంటింటికీ వెళ్లిన ప్రజాప్రతినిధులు ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. గ్రామగ్రామాన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ నాయకులకు ప్రజల నుంచి ఆదరాభిమానాలు లభిస్తుండడం విశేషం. – సాక్షి నెట్‌వర్క్


బాడంగి: గజరాయునివలసలో ప్రచారం చేస్తున్న జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్ తదితరులు

• ప్రగతి బాటలు


పినపెంకి రోడ్డు నుంచి ఆనవరం వరకు కొత్తగా వేసిన తారురోడ్డు


కోటిపల్లి-రావివలస రోడ్డు


డొంకినవలస ఆర్ఎస్ రోడ్డు నుంచి పెదపల్లి వరకు వేసిన రోడ్డు


కొత్తగా నిర్మించిన డొంకినవలస-పిండ్రంగివలస రోడ్డు

బాడంగి: మండలంలో రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు.. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మారాయి. గ్రామగ్రామాన కొత్తగా సీసీ రోడ్లు, కాలువలు నిర్మించారు. వీటితో పాటు గ్రామాలను కలుపుతూ తారురోడ్లు వేశారు. కనీస రోడ్డు సదుపాయం లేని గ్రామాలకు సైతం ఇప్పుడు పక్కా రోడ్లు వేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పినపెంకి రోడ్డు జంక్షన్ నుంచి ఆనవరానికి 2.05 కిలోమీటర్ల మేర రూ.70 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టడంతో పాటు, కోటిపల్లి రోడ్డు జంక్షన్ నుంచి గూడెపువలస, అల్లువానివలస, రావివలస-మల్లంపేట రోడ్డు జంక్షన్ వరకు 4.05 కిలోమీటర్ల మేర రూ.1.30 కోట్లతో తారురోడ్డు నిర్మించారు. అలాగే డొంకినవలస రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి పిండ్రగివలసకు 2.7 కిలోమీటర్ల మేర రూ.150 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు, డొంకినవలస రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి తెంటువలస, పెదపల్లి వరకు 1.50 కిలోమీటర్ల మేర రూ.60 లక్షల వ్యయంతో తారురోడ్డు నిర్మించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమం జరుగుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300

సంతకవిటి: నిర్దేశిత కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 గిట్టుబాటు అవుతుందని ఉపాధి హామీ పనుల వేతనదారులకు ఏపీవో హరనాథరావు అన్నారు. మండలంలోని చిత్తారపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శనివారం పరిశీలించారు. వేసవి ఎండల నేపథ్యంలో చల్లగా ఉన్న సమయంలో పనులు చేయాలని, పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

రేగిడి: మండలంలోని అంబఖండి, సోమరాజుపేట, వావిలవలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఏపీవో ఎస్.హరనాథరావు శనివారం పరిశీలించారు. గిట్టుబాటు అయ్యే వేతనం రావాలంటే కొలతల ప్రకారం పనులు చేయాలని తెలిపారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, వడదెబ్బ బారినపడకుండా చూసుకోవాలన్నారు. పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలన్నారు.

వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి

రాజాం: ఎన్నికల రోజున(మే 13వ తేదీన) పరిశ్రమలు, సంస్థలు, దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని రాజాం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ బి.కొండలరావు ఓ ప్రకటనలో శనివారం సూచించారు. సెలవు ఇచ్చినందుకు కార్మికుల, ఉద్యోగుల వేతనాల్లో కోత విధిస్తే చర్యలు తప్పవన్నారు.

నేడు బాడంగిలో ఎమ్మెల్యే ప్రచారం

బాడంగి: మండలంలో వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మినాయుని వెంకటనాయుడు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. తొలుత వీరసాగరం, పిండ్రంగివలస, డొంకినవలస ఆర్ఎస్, పెదపల్లి, తెంటువలస, డొంకినవలస, లక్ష్మీపురం గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలంతా ప్రచారంలో పాల్గొని, ఎమ్మెల్యేకు మద్దతు తెలపాలన్నారు.

సంతకవిటి: మండలంలోని సురవరం, మామిడిపల్లి, పుల్లిట, బొద్దూరు గ్రామాల్లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్త లు, అభిమానులంతా హాజరుకావాలని కోరారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు


కాలువలో పూడికలు తొలగిస్తున్న దృశ్యం

రాజాం: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు గురవాం గ్రామంలో శనివారం జరిగిన పనులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. గ్రామాల పరిశుభ్రతతోనే గ్రామస్తుల ఆరోగ్యం బాగుంటుందన్నారు. ఎక్కడపడితే అక్కడ అనవసరంగా చెత్తాచెదారం వేయకూడదన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామా


రామభద్రపురం: ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు


రాజాం: రాజీనామా పత్రాలు చూపిస్తున్న ఆగూరు వలంటీర్లు

రామభద్రపురం: అన్ని మండలాల్లోని గ్రామాల్లో వలంటీర్ల రాజీనామా కొనసాగుతోంది. శనివారం మండలంలోని 17 మంది వలంటీర్లు రాజీనామా చేసి, తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో ఈశ్వరమ్మకు అందజేశారు. రాజీనామా చేసిన వారిలో రొంపల్లి గ్రామానికి చెందిన ఏడుగురు, కోటశిర్లాం గ్రామానికి చెందిన తొమ్మిది మంది, నాయుడువలసకు చెందిన ఒకరు ఉన్నారు. మండలంలో మొత్తం 294 మంది వలంటీర్లు ఉండగా, ఇప్పటివరకు 147 మంది రాజీనామా పత్రాలు సమర్పించినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

సంతకవిటి: మండలంలోని మంతిన గ్రామంలో 19 మంది, సిరిపురంలో 28 మంది, జి.ఎస్.పురంలో 8 మంది, గోళ్లవలసలో ఒక వలంటీర్ శనివారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు.

రాజాం: మండలంలోని ఆగూరు పంచాయతీకి చెందిన 14 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే వారంతా రాజీనామా చేసినట్లు తెలిపారని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు వెల్లడించారు. ఇప్పటివరకు మండలంలో మొత్తం 165 మంది వలంటీర్లు రాజీనామ చేసినట్లు పేర్కొన్నారు.

మెనూ ప్రకారమే మధ్యాహ్న భోజనం


వండానపేట పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం పెట్టాలని ఎంఈవో ప్రసాదరావు సూచించారు. మండలంలోని వండానపేట, చాటాయవలస, ఉప్పర్నాయుడువలస గ్రామ పాఠశాలల్లోని విద్యార్థులకు వడ్డించిన మధ్యాహ్న భోజనం వంటకాలను ఆయన శనివారం పరిశీలించారు. వంటకాలు రుచి, శుచి కలిగి ఉండేలా చూడాలని వంట నిర్వాహకులకు సూచించారు. అనంతరం వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంధుల క్రికెట్ కెప్టెన్‌కు సన్మానం


దుర్గారావును సన్మానిస్తున్న గ్రామపెద్దలు

వంగర: భారత అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్ టొంపాకి దుర్గారావును ఆయన స్వగ్రామం మండలంలోని కొప్పరవలసలో శనివారం సన్మానించారు. ఓ మారుమూల గ్రామీణ ప్రాంతంలో పేదింట్లో పుట్టి, దేశం గర్వించేలా దుర్గారావు ఎదగడం తమ ఊరుకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని గ్రామస్తులు ప్రశంసించారు. ఇదే విశ్వాసంతో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సాదెం శ్రీరామ్మూర్తి, సాదెం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఖండ్యాంలో 'ఫ్యామిలీ డాక్టర్'


ఖండ్యాంలో ఇంటింటికీ వెళ్లి, వైద్య సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, మంచానపడిన రోగుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


ప్రమాద నివారణ పరికరాల ప్రదర్శనలో ఫైర్ సిబ్బంది

రాజాం సిటీ: పట్టణంలో ఈ నెల 14వ తేదీ నుంచి నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఫైర్ ఎస్ఐ జనార్దనరావు మాట్లాడుతూ ప్రమాదాలు, అనుకోని ఘటనలు జరిగిన సమయంలో సిబ్బందికి ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. అనంతరం అన్నివేళల అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రమాదాల నివారణకు సహకరిస్తున్న సిబ్బందిని అభినందించారు. ఆ తర్వాత స్టేషన్ ఆవరణలో ప్రమాదాల సమయంలో ఉపయోగించే పరికరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో విశ్రాంత్ ఎస్ఐ ఎం.కృష్ణమూర్తిరాజు, ఫైర్ ఏఎస్ఐ వై.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: పట్టణ పరిధిలోని ప్రజలకు తాగునీటి సరఫరాలో ఆదివారం అంతరాయం ఏర్పడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. భోజరాజపురం వాటర్ పంపింగ్ సిస్టం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

బొబ్బిలి: మండలంలోని పిరిడిలో కొత్తగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపుతో పాటు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు విజయానికి కూడా కృషి చేయాలని కోరారు. అనంతరం వేణుగోపాలనాయుడిని స్థానిక నేతలు సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు బొత్స కాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యకు చెక్


కొత్తగా నిర్మించిన సీసీ కాలువ

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో దీర్ఘకాలిక సమస్యకు అధికారులు చెక్ పెట్టారు. వీధి శివారున మురుగుకాలువ లేకపోవడంతో గ్రామ మురుగునీరంతా గ్రామంలోకి తిరిగి వచ్చేస్తుండేది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న అధికారులు 15వ ఆర్థిక సంఘం నిధుల్లో నుంచి రూ.3 లక్షలు కేటాయించి, డ్రైనేజీని నిర్మించారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.